

2 లో

సీఐ వెంకటేష్‌ను కలసిన జై భవాని యూత్ అసోసియేషన్ శ్రీ విజయ దుర్గ అసోసియేషన్ల సభ్యులు


# సంగారెడ్డి మెదక్

ఆదివారం 11 అక్టోబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:06


# రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

- లోవోల్టేజీ, రుణమాఫీ, నల్లవాగు నీరు, అధ్వాన రోడ్లపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర





**కల్హేర్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
కల్హేర్ మండలంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ లోవోల్టేజీ, నల్లవాగు సాగునీరు, రోడ్ల దుస్థితి, రైతు రుణమాఫీ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలోని మాసాన్పల్లి ఎక్స్‌రోడ్డు నుంచి కల్హేర్ మండల కేంద్రం వరకు శనివారం బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు.

వివరాలు 2లో



# ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలి.!

- కలెక్టర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలని టి యు డబ్ల్యూ జే (ఐ జేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆకాంక్షించారు. పేద బడుగు వర్గాల తో పాటు జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు.

వివరాలు 2లో

# రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

మొదటిపేజీ తరువాయి



అనంతరం కల్హేర్‌లో ధర్నా చేపట్టి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. వందలాది మంది రైతులు, కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విద్యుత్ అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. లోవోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. నల్లవాగు సాగునీటిని రైతులకు సక్రమంగా అందించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపడతామని గతంలో చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని, మండలంలోని అనేక రహదారులు అధ్వానంగా మారి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు, ప్రజల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు రైతుల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రామ్‌సింగ్, కల్హేర్, మీర్ఖంపేట్, రాపర్తి, మహాదేవపల్లి, మాసాన్పల్లి, ఇందిరానగర్, కృష్ణాపూర్, బీబీపేట్, మార్ధి, ఫతేపూర్ గ్రామాలకు చెందిన తాజా మాజీ బీఆర్ఎస్ సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ప్రజా నాయకులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవం







**కల్హేర్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):**

మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి నీటి పాదయాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అభివృద్ధి విషయంలో వాస్తవాలను ప్రజల ముందుంచాలని, తప్పుదోవ పట్టించే ఆరోపణలకు దూరంగా ఉండాలని కోరారు. కల్హేర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో స్థానిక రాజకీయాలు, అభివృద్ధి పనులు, రైతుల సమస్యలపై చర్చ జరిగింది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలు అవాస్తవమని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేయడం సరికాదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు గైని దేవదాస్ మాట్లాడుతూ, కల్హేర్ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అనేక రహదారులు, సీసీ రోడ్లు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించామని తెలిపారు. కృష్ణాపురం గ్రామంలో తొలి సీసీ రోడ్డు నిర్మాణం కూడా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని పేర్కొన్నారు. గత పాలనలో అవసరం లేని ప్రాంతాల్లో బ్రిడ్జిలు, ఇతర నిర్మాణాలు చేపట్టారని, వాటి వల్ల ప్రజలకు ఎంతమేర ప్రయోజనం కలిగిందో మాజీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కల్హేర్‌లోని కళాశాల, నీలవాగుపై నిర్మించిన బ్రిడ్జి తదితర నిర్మాణాలను ఉదాహరణగా పేర్కొన్నారు. అవసరమైన రహదారి సౌకర్యాలు కల్పించకుండా కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టడం వల్ల అవి ప్రస్తుతం ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదని దేవదాస్ విమర్శించారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుండు నరేందర్ మాట్లాడుతూ, వారంలో కనీసం రెండు రోజులు ఖానాపురం గ్రామానికి చెందిన రైతులు, భూస్వాములు నీటి వినియోగాన్ని తగ్గించుకోవాలని కోరారు. చివరి ఆయకట్టులో ఉన్న ఇంద్రానగర్, కల్హేర్ గ్రామాల రైతుల పంట పొలాలు ఎండిపోకుండా చూసే బాధ్యత పూర్తిగా వారిపై ఉందని తెలిపారు. చివరి ఆయకట్టులో బలహీన, బడుగు వర్గాల సోదరుల భూములు ఉన్నాయని, విమర్శ కంటే సహాయం చేయడమే గొప్పని అన్నారు. సీడీసీ చైర్మన్ ఎన్నం నరసింహారెడ్డి మాట్లాడుతూ, రైతుల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రకృతి పరిస్థితులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత వంటి కారణాలతో కొన్నిసార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బాధ్యురాలిగా చేయడం సరికాదని విమర్శించారు. ఈ సమావేశంలో ఎన్నం రవీందర్‌రెడ్డి, గుండు నరేందర్, బీబీపేట్ పి. వెంకట్‌రెడ్డి, మైనార్టీ కోఆప్షన్ మాజీ సభ్యుడు సర్దార్, సర్పంచ్ కోడి గంగారాం, ఉపసర్పంచ్ పి. మహేష్, మాసానపల్లి సీనియర్ నాయకుడు అనిల్‌కుమార్. ఆల్లూరి గోపాల్. తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలి.!

మొదటిపేజీ తరువాయి

టియుడబ్ల్యూ జే -ఐజేయుసంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను జర్నలిస్టులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుస్తకాలు, పెన్నులు అంద జేశారు. కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏ అండ దండా లేని పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉండాలని కోరారు. అందుకు తగిన ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లాలో జర్నలిస్టులకు తోడుగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని పేర్కొన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ మనస్ఫూర్తిగా స్పందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మతిన్,సీనియర్ జర్నలిస్టు మసూద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, జర్నలిస్టులు సూర్య వెంకట్, దినేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐ వెంకటేష్‌ను కలసిన జై భవాని యూత్ అసోసియేషన్ శ్రీ విజయ దుర్గ అసోసియేషన్ల సభ్యులు

మొదటిపేజీ తరువాయి

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జై భవాని యూత్ అసోసియేషన్ మరియు శ్రీ విజయ దుర్గ అసోసియేషన్ వారు స్థానిక సీఐ వెంకటేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా మైక్ వినియోగానికి సంబంధించిన అనుమతులను అధికారులు ఇచ్చేలా అనుమతి పత్రాలు తీసుకున్నారు. అలాగే, శ్రీ విజయ దుర్గ అసోసియేషన్ పాత కేరి వారు ఉత్సవాల ప్రత్యేక కరపత్రాన్ని సీఐ వెంకటేష్ కి అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా సీఐ ని అసోసియేషన్ సభ్యులు ఆత్మీయంగా ఆహ్వానించారు...

# శ్రీ దుర్గా భవాని శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

## దుర్గమ్మ నామస్మరణతో మార్మోగనున్న వెల్దుర్తి

## శ్రీ దుర్గా భవాని సేవా సమితి, శివాజీ యూత్ ఆధ్వర్యంలో

## నవరాత్రి ఉత్సవాలకు భక్తజనానికి ఆహ్వానం

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 10:**

మెదక్ జిల్లా, వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ దుర్గా భవాని సేవా సమితి మరియు శివాజీ యూత్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా భవాని శరన్నవరాత్రి ఉత్సవాలను, వెంకటేశ్వర ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 20 వరకు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామంలో భక్తిమయ వాతావరణం నెలకొననుంది.

**అక్టోబర్ 16న అన్నప్రసాద కార్యక్రమం**

ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 16, శుక్రవారం రోజున నవదుర్గ హోమం, అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**అక్టోబర్ 20న దసరా రావణాసుర దహనం**

అక్టోబర్ 20, మంగళవారం రాత్రి 7 గంటలకు దసరా రావణాసుర దహనం కార్యక్రమం నిర్వహించనున్నారు.

**అక్టోబర్ 21న ప్రత్యేక పూజలు.. అమ్మవారి ఊరేగింపు**






అక్టోబర్ 21, బుధవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలు, మధ్యాహ్నం 4 గంటలకు అమ్మవారి ఊరేగింపును నిర్వహించనున్నారు. ఈ పవిత్ర ఉత్సవాల్లో భక్తులు, గ్రామ ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని శ్రీ దుర్గా భవాని సేవా సమితి మరియు శివాజీ యూత్ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**






సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బండలగూడలోని మార్క్స్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స పొందాలని సూచించారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయంతో రైతులకు తప్పని తిప్పలు.

## - రైతు గోస వినబడుతలేదా?....

## - రైతు బాధ కనబడత లేదా?..

## ప్రభుత్వ వైఖరి పై బండారి పాండు ధ్వజం!!

**మునిపల్లి అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):**




మునిపల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారి పాండు ప్రభుత్వ వైఖరి పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విద్యుత్తు కోతలు రైతుల పాలిట శాపంగా మారాయని రైతు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అయినా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో అన్నదాతలో ఆందోళన మొదలైందని మండలం లోని అన్ని గ్రామాలలో వ్యవసాయ రైతులు కూలీలు కరెంటు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని మునిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారి పాండు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సారు రైతుకు ఇచ్చిన గౌరవాన్ని గుర్తు చేశారు రైతు కంట్లో కన్నీరు కారిస్తే రాజ్యానికే శాపమని కెసిఆర్ పాలనలో రామరాజ్యం చూసామని ఇప్పుడు రావణ రాజ్యం కనిపిస్తుందని ప్రభుత్వాన్ని విమర్శించారు ప్రజలు అన్ని గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో కర్రు కాల్చి కాంగ్రెస్సు ఇంటికి పంపుతారని జోస్యం చెప్పారు. గ్రామాలలో రాత్రిపూట కరెంటు అంతరాయంతో పిల్లలు విద్యార్థులు, వృద్ధులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్ సరఫరా సక్రమంగా అందించి రైతులకు సహకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేడు చిన్న ఘనపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ

**కొల్చారం,అక్టోబర్10(ప్రజా జ్యోతి)**

కొల్చారం మండలంలోని చిన్న ఘనపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నేడు ఉదయం 11 గంటలకు సొసైటీ ఆవరణలో మహాజన సభ నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు మంద నాగయ్య తెలిపారు.సంఘం ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, సొసైటీ పరిధిలోని రైతులు, గ్రామ పెద్దలు, యువకులు, ఇతర గ్రామస్తులు సభకు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు. అందరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.వ్యవసాయ సహకార సంఘం కార్యకలాపాల్లో రైతుల భాగస్వామ్యం కీలకమని, సంఘానికి సంబంధించిన కార్యక్రమాల్లో సభ్యులు చురుకుగా పాల్గొనాలని మంద నాగయ్య తెలిపారు.




# విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలి

## - లోవోల్టేజీ సమస్యతో బోర్ మోటార్లు చెడిపోతున్నాయి
## - రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు వినతి

**కొండాపూర్ ప్రజా జ్యోతి**



వ్యవసాయ రంగానికి విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పుప్పాల అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ ప్రకాశం ట్రాన్స్‌కో అధికారులను కోరారు. లోవోల్టేజీ సమస్య కారణంగా బోర్ మోటార్లు తరచూ చెడిపోతున్నాయని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శనివారం కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలకు విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లోవోల్టేజీ కారణంగా బోర్ మోటార్లు సరిగా పనిచేయడం లేదని, తరచూ మరమ్మతులు చేయించుకోవాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల పంటలకు నీరందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పుప్పాల అనిల్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని కోరారు. లోవోల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సమస్యల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కొండాపూర్ ట్రాన్స్‌కో ఏడీఈ దృష్టికి తీసుకెళ్లగా, లోవోల్టేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు అనిల్ కుమార్ తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం

## - ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్

**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్, బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ అన్నారు. బండ్లగూడలోని మార్బ్ నగర్ కాలనీలో పటాన్‌చెరు క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు.ఈ శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు, వైద్య సేవలను ఉచితంగా అందించారు. గుండె సంబంధిత సమస్యలు, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, కంటి పరీక్షలతో పాటు రక్తపరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో, ఆర్థోపెడిక్ విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. వైద్య నిపుణులు ప్రజలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై తగిన సూచనలు అందించారు.ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడంలో ఇలాంటి




శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న పటాన్‌చెరు క్రిస్టియన్



యూత్ అసోసియేషన్ నిర్వాహకులను ఆయన అభినందించారు. భవిష్యత్తులోనూ ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

# వరుస ఆటో దొంగతనాల దొంగ అరెస్ట్ ఆటో స్వాధీనం




**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సదాశివపేటలో వరుస ఆటో దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన ఆటోను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.గత నెల 29న సదాశివపేట ఆర్టీసీ బస్టాండ్ బయట పార్క్ చేసిన ఒక ఆటోను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సదాశివపేట ఇన్స్పెక్టర్ డి. వెంకటేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు.సిసిటీవీ దృశ్యాలు, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి దర్యాప్తు జరిపిన పోలీసులు నిందితుడిని చౌహాన్ గోవింద్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి చోరీకి గురైన ఆటోను రికవరీ చేశారు.

# ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌లో భాగంగా నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు అపూర్వ స్పందన.

- జిల్లా వ్యాప్తంగా 1,485 మంది అభ్యర్థులు హాజరు.. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రాతిక్ జైన్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు అందించనున్న ఉచిత కోచింగ్‌లో భాగంగా ఈరోజు నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ ప్రశాంతంగా ముగిసింది.పోలీసు ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ఉత్సాహంతో సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించిందని, జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాలలో సంగారెడ్డి: 765, అందోల్: 265, జహీరాబాద్: 455 మొత్తం 1,485 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన, పోలీసు ఉద్యోగాలకు అవసరమైన శారీరక శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.



అర్హులైన అభ్యర్థులకు పోలీసు ఉద్యోగాల సాధనలో తగిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించడమే ఈ ఉచిత కోచింగ్ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి తమ లక్ష్యాలను సాధించాలన్నారు.

# మద్యం తాగి నడిపినా.. లైసెన్స్ లేకున్నా జైలుకే!

- సదాశివపేటలో పోలీసుల కొరడా..

సీఐ వెంకటేష్ సంచలన హెచ్చరిక

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

పట్టణ మరియు మండల పరిధిలో రహదారి భద్రతా నియమాలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని సదాశివపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) వెంకటేష్ స్పష్టం చేశారు. సీఐ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) మరియు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్లపైకి రావడం చట్టరీత్యా తీవ్ర నేరమని హెచ్చరించారు. రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని సూచించారు.మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానాతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, కోర్టుకు రిమాండ్ చేస్తాం.సరైన లైసెన్స్, వాహన పత్రాలు లేకుండా తిరిగే వాహనాలను తక్షణమే స్వాధీనం చేసుకుంటాం.మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తాం.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఐ తేల్చి చెప్పారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన మండల ఏర్పాటుతో అభివృద్ధికి బాటలు

కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల పాలాభిషేకం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల(ప్రజాజ్యోతి)**



నూతన మండలంగా ఏర్పాటై పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గుమ్మడిదలలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండల ఏర్పాటుతోనే ప్రాంత అభివృద్ధికి బలమైన పునాది పడిందని నాయకులు పేర్కొన్నారు.బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2016లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గుమ్మడిదలను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రజలకు పరిపాలన మరింత చేరువైందన్నారు. మండల కేంద్రం ఏర్పాటుతో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడంతో పాటు అభివృద్ధి పనులకు ఊతం లభించిందని తెలిపారు.గతంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవని, మండల ఏర్పాటు అనంతరం స్థానికంగా పరిపాలనా సౌలభ్యం మెరుగుపడిందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రాంత అభివృద్ధికి మండల ఏర్పాటు దోహదపడిందని అన్నారు. గుమ్మడిదల ప్రగతిలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం కీలక పాత్ర పోషించిందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ లు రాజశేఖర్, చక్రపాణి, విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, శేఖర్‌రెడ్డి, సదానందరెడ్డి, మొగులయ్య, అంజనేయులు యాదవ్, వినోద్ గౌడ్, రమేష్, సత్యనారాయణ, ప్రకాష్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేట పట్టణం లోని సిద్దాపూర్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి: జగ్గారెడ్డి, నిర్మల

### కూల్చివేతలు లేకుండా, పాన్ షాప్ లు, పూల దుకాణాలు,మటన్, చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలి

### అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన సిద్దాపూర్ రోడ్డును పరిశీలించారు. ఆర్అండ్బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో రోడ్డు నిర్మాణం, వర్షపు నీటి పారుదల, కల్వర్టులు, డ్రైనేజీ పనులపై సమీక్ష నిర్వహించారు.మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ కాలనీ చివరి వరకు పలుమార్లు పనులు చేపట్టినా రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంపై జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దాపూర్ రోడ్డు వేయించానని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఈ రోడ్డు విషయంలో ఏం జరిగిందో తెలియదన్నారు. ఇకపై సిద్దాపూర్ రోడ్డు సమస్య పదేపదే చర్చకు రాకుండా పటిష్ఠంగా పనులు చేపట్టాలని సూచించారు.మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ ఈద్గా వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు సాంకేతికంగా సరైన లెవల్స్ తీసుకుని, వరద నీరు, డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా రోడ్డు నిర్మించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా డ్రైన్లు, అవసరమైన చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కల్వర్టులు అవసరమైన ప్రాంతాలను జగ్గారెడ్డి, నిర్మల స్వయంగా పరిశీలించారు.రోడ్డు వెడల్పు, అందుబాటులో ఉన్న స్థలాన్ని టేపుతో కొలిచి మరీ పరిశీలించారు.కూల్చివేతలు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. 30 అడుగుల వెడల్పు ఉన్నచోట 30 అడుగులు, 40 అడుగులు ఉన్నచోట 40 అడుగులు, 60 అడుగులు అందుబాటులో ఉన్నచోట 60 అడుగుల మేర రోడ్డు నిర్మించాలని చెప్పారు. తనకు తెలియజేయకుండా సిద్దాపూర్ రోడ్డులో ఏ డబ్బానూ తొలగించవద్దని స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, పాన్‌షాపులు, పూల దుకాణాలు, మటన్, చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలన్నారు.సిద్దాపూర్ కూడలిలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా జంక్షన్ అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యలో విగ్రహం ఏర్పాటుకు అనువుగా సర్కిల్ రూపకల్పన చేయాలని చెప్పారు. రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.సిద్దాపూర్ రోడ్డు పనులకు సంబంధించి రూ.2 కోట్ల నిధులు మిగిలి ఉన్నాయని, మున్సిపాలిటీలో టీఎఫ్ఐడీసీకి చెందిన మరో రూ.5 కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని సమీక్షలో ప్రస్తావించారు. కలెక్టర్‌తో సమావేశం అనంతరం సంబంధిత శాఖల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సరైన లెవల్స్, డ్రైన్లు, కల్వర్టులతో కూడిన 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.పట్టణం, మండలంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రోజూ ఒక ప్రాంతంలో పర్యటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. త్వరలో ఊబ చెరువును పరిశీలిస్తానన్నారు.

